బీసీలకు అండదండగా జగనన్న

- రాజకీయంగా బీసీలకు పెద్దపీట
- నామినేటెడ్ పోస్టుల్లో సముచితస్థానం
- బీసీలకు శ్రీతిరుపతమ్మ అమ్మవారి ఆలయ చైర్మన్ పదవి
- ఆలయ చరిత్రలో ఇదే ప్రథమం
- బీసీల కోసం కమ్యూనిటీ భవనాలు



శ్రీతిరుపతమ్మ వారి ఆలయ పాలకమండలి ప్రమాణస్వీకారోత్సవం(ఫైల్)



జగ్గయ్యపేటలో ముదిరాజ్‌లకు కేటాయించిన భవనం

పెనుగంచిప్రోలు: గత పాలకులు బీసీలను ఓటుబ్యాంకుగానే చూడగా..ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం బీసీలను బ్యాక్‌వర్డ్ కాదు..బ్యాక్‌బోన్‌గా గుర్తించి వారి అభివృద్ధి, సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టి వారికి అండదండగా నిలుస్తోంది. సామాజికంగా, రాజకీయంగా బీసీలకు సముచితస్థానం కల్పిస్తూ వారికి అనేక పదవులను కట్టబెట్టింది. టీడీపీ అధినేత చంద్రబాబు బీసీలను చులకనగా మాట్లాడటంతో పాటు వారి సంక్షేమాన్ని గాలికొదిలేయగా, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీల ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేయడంతోపాటు నామినేటెడ్ పోస్టుల్లో ఎస్సీ, ఎస్టీలతో కలిసి బీసీలకు 50శాతం పదవులు ఇచ్చి రాష్ట్ర రాజకీయచరిత్రలో సరికొత్త అధ్యాయనానికి శ్రీకారం చుట్టారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల కారణంగా ఈ ఐదేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా బీసీలు రాజకీయంగా మరిన్ని పదవులు పొందగలిగారు. ఇందుకు జగ్గయ్యపేట నియోజకవర్గంలో ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ప్రత్యేక కృషితో బీసీలకు అనేక పదవులు దక్కడమే నిదర్శనంగా చెప్పవచ్చు.

ఉన్నత పదవుల్లో బీసీలు...

తెలుగురాష్ట్రాల్లో ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న పెనుగంచిప్రోలు శ్రీతిరుపతమ్మవారి ఆలయ చైర్మన్‌గా యాదవ సామాజికవర్గానికి చెందిన గుండబోయినపాలెం గ్రామవాసి జంగాల శ్రీనివాసరావు నియమితులయ్యారు. దశాబ్దాల అమ్మవారి ఆలయ చరిత్రలో మొట్టమొదటిసారిగా ఓ బీసీకి చైర్మన్ పదవి దక్కడం ఓ రికార్డుగా చెప్పవచ్చు. జగ్గయ్యపేట మున్సిపల్ చైర్మన్ పదవిని పట్కారీ సామాజికవర్గానికి చెందిన రంగాపురం రాఘవేంద్రకు ఇచ్చారు. రాష్ట్ర మహిళా ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా యాదవ సామాజికవర్గానికి చెందిన చిల్లకల్లు గ్రామవాసి సంపత్ విజిత నియమితులయ్యారు. వడ్డెర సామాజికవర్గానికి చెందిన పెనుగంచిప్రోలువాసి బత్తుల రామారావు, రాష్ట్ర మైనింగ్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులుకాగా, పూసల కార్పొరేషన్ డైరెక్టర్‌గా చేని కుమారికి పదవి దక్కింది. యాదవ సామాజికవర్గానికి చెందిన కొలుసు రమాదేవి వత్సవాయి ఎంపీపీగా పనిచేస్తుండగా, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వచ్చిన తొలినాళ్లలో ఇదే సామాజికవర్గానికి చెందిన వత్సవాయి మండలవాసి పొదిలి లక్ష్మీనారాయణకు జగ్గయ్యపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి దక్కింది. అదేవిధంగా పార్టీ పరంగా కూడా జగ్గయ్యపేట పద్మశాలి సామాజికవర్గానికి చెందిన పెంటి శ్రీనివాసరావు వైఎస్సార్ సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడిగా నియమించారు. ఇలా బీసీలకు స్థానికసంస్థల రిజర్వేషన్ల ప్రకారం లభించే పదవులతోపాటు నామినేటెడ్ పదవుల్లోనూ సముచితస్థానం కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీకే దక్కిందని బీసీలు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

ఆలయ కమిటీ సభ్యులుగా బీసీలు..

శ్రీతిరుపతమ్మ ఆలయ పాలక మండలి సభ్యులుగా నాయిబ్రాహ్మణ సామాజికవర్గానికి చెందిన కొలిపాక రాము, దేవరకొండ పద్మ, యాదవ సామాజికవర్గానికి చెందిన వీర్ల రమణ, రజక సామాజికవర్గానికి చెందిన చీకటిమళ్ల వెంకటరమణ, పద్మశాలి సామాజికవర్గానికి చెందిన పాలాది వెంకటరమణ నియమితులయ్యారు. తిరుమలగిరి వెంకటేశ్వరస్వామి ఆలయ డైరెక్టర్లుగా భట్రాజు సామాజికవర్గానికి చెందిన కూరపాటి సరస్వతీదేవి, నాయిబ్రాహ్మణ సామాజికవర్గానికి చెందిన కనిగిరి రమాదేవి, రజక సామాజికవర్గానికి చెందిన లింగగిరి రాంబాబు, యాదవ సామాజికవర్గానికి చెందిన దర్శి వెంకటేశ్వర్లుకు పదవులు దక్కాయి.

కమ్యూనిటీ భవనాల నిర్మాణాలు..

బీసీల కోసం జగ్గయ్యపేట నియోజకర్గంలో కమ్యూనిటీ భవనాలు కూడా నిర్మిస్తున్నారు. జగ్గయ్యపేట మండలంలోని పోచంపల్లి గ్రామంలో రూ.40లక్షలతో చేపట్టిన ముదిరాజ్ కమ్యూనిటీ హాల్ నిర్మాణంలో ఉంది. జగ్గయ్యపేటలో సుమారు రూ.50 లక్షల విలువైన భవనాన్ని ముదిరాజ్ కమ్యూనిటీ హాల్‌కు కేటాయించారు. ఇప్పటివరకు ఇలా తమ గురించి ఏ నాయకుడు, ప్రభుత్వం ఆలోచించలేదని ముదిరాజ్ సామాజికవర్గీయులు చెబుతున్నారు. సీఎం జగనన్న ప్రభుత్వంలోనే ఎమ్మెల్యే ఉదయభాను ద్వారానే కమ్యూనిటీ భవనాల ఏర్పాటు సాధ్యమైందని వారు హర్షం వ్యక్తంచేస్తున్నారు. పెనుగంచిప్రోలు మండలం నవాబుపేటలో వడ్డెరల కోసం 20సెంట్ల స్థలంలో రూ.40 లక్షలతో కల్యాణ మండపం నిర్మిస్తున్నారు. జగ్గయ్యపేటలో వడ్డెరల శ్మాశాన వాటికల చుట్టూ ప్రహరీగోడల నిర్మాణం చేపట్టారు. వడ్డెర కార్మికులకు ఈ ఐదేళ్లలో రూ.2.70కోట్లతో ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించారు. ఇలా ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా బీసీలు ఎంతో అభివృద్ధి చెందాలంటూ తమ అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ఎంతో కృషిచేశారని జగ్గయ్యపేట నియోజకవర్గంలోని బీసీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



నవాబుపేటలో ముదిరాజ్‌ల కోసం నిర్మిస్తున్న కల్యాణ మండపం

బీసీలకు ఉన్నత స్థానం..



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో బీసీలకు ఉన్నత స్థానం కల్పించారు. స్థానిక ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ప్రత్యేక చొరవతో పోచంపల్లి, మక్కపేటల్లో కమ్యూనిటీ హాళ్లు నిర్మిస్తుండటం సంతోషదాయకం.

–చాపల వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షులు, ముదిరాజ్ యువజన సంఘం

కల నెరవేరుతోంది..



మాగ్రామం నవాబుపేటలో వడ్డెరలు ఎక్కువసంఖ్యలో ఉన్నారు. ఏదైనా శుభకార్యాలు చేసుకోవాలంటే సరైన వసతిలేక ఇబ్బందిపడుతున్నాం. సీఎం జగనన్న పాలనలలో ఎమ్మెల్యే ఉదయభాను సారథ్యంలో రూ.40లక్షలతో కల్యాణ మండపం నిర్మిస్తుండటంతో మాకల నెరవేరుతోంది.

–మురళీకృష్ణ, వడ్డెర సంఘ నాయకుడు

చరిత్ర తిరగరాసిన జగనన్న..



బీసీ వర్గానికి చెందిన తనను మొట్టమొదటి సారిగా శ్రీతిరుపతమ్మ వారి ఆలయ చైర్మన్‌గా నియమించిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే ఉదయభానుకే దక్కుతుంది. గత ప్రభుత్వాలు మమ్మల్ని ఓటు బ్యాంక్‌గానే చూశాయి. సీఎం జగనన్న ప్రభుత్వం మాత్రం అక్కున చేర్చుకుని అండగా నిలిచింది.

–జంగాల శ్రీనివాసరావు, శ్రీతిరుపతమ్మ ఆలయ చైర్మన్

బీసీలకు ప్రాధాన్యం..



స్థానిక ఎమ్మెల్యే ఉదయభాను సహకారంతో మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నిక కావటం ఎంతో సంతోషంగా ఉంది. గతంలో ఏముఖ్యమంత్రి చేయని విధంగా బీసీ కులాలకు 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుంది. నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు సముచితస్థానం దక్కింది.

–రంగాపురం రాఘవేంద్ర, జగ్గయ్యపేట మున్సిపల్ చైర్మన్

బీసీలను గుర్తించిన ఏకైక ప్రభుత్వం..



సామాన్య కార్యకర్తగా ఉన్న తనకు ఎమ్మెల్యే ఉదయభాను సూచన మేరకు రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ డైరెక్టర్ పదవి ఇవ్వడం జీవితంలో మరచిపోలేను. బీసీల తోకలు కత్తిరిస్తామన్న గత టీడీపీ ప్రభుత్వ పాలన చూశాం. బీసీలను ఉన్నత స్థితిలో ఉంచిన సీఎం జగనన్న ప్రభుత్వాన్ని చూస్తున్నాం.

–బత్తుల రామారావు, మైనింగ్ కార్పొరేషన్ డైరెక్టర్

మాకు గౌరవం దక్కింది..



గతంలో తమ సామాజిక వర్గాన్ని రాజకీయంగా ఏప్రభుత్వం గుర్తించలేదు. కానీ జగనన్న ప్రభుత్వం వచ్చాక తమ కులాలను గుర్తించడమే కాకుండా ప్రత్యేకంగా కార్పొరేషన్లు ఏర్పాటు చేశారు. జగనన్న ప్రభుత్వం ద్వారా మాకు గౌరవం దక్కింది. ఎమ్మెల్యే ఉదయభాను, ముఖ్యమంత్రి జగనన్నకు అండగా ఉంటాం.

–చేని కుమారి, పూసల కార్పొరేషన్ డైరెక్టర్

క్లుప్తంగా

బీసీ సమ్మేళనానికి తరలిరండి



రావిరాల(జగ్గయ్యపేట): పట్టణంలోని ఎస్‌జీఎస్ కళాశాల ఆవరణలో ఆదివారం నిర్వహించే నియోజకవర్గస్థాయి బీసీ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని నియోజకవర్గ బీసీ సెల్ కన్వీనర్ వేముల మల్లేశ్వరరావు కోరారు. మండలంలోని రావిరాలలో శనివారం ఆయన బీసీ సదస్సు కరప్రతాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్లేశ్వరరావు మాట్లాడుతూ సమ్మేళనానికి రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్‌లతోపాటు రాష్ట్రంలోని బీసీ ప్రజాప్రతినిధులు హాజరుకానున్నట్లు తెలిపారు. బీసీలంతా హాజరుకావాలని ఆయన కోరారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మండవ శ్రీనివాస్‌గౌడ్, బీసీ సెల్ నాయకులు చాపల వెంకటేశ్వర్లు, గుంజి లక్ష్మణ, బత్తుల శ్రీనివాస్, రాగం కోటయ్య పాల్గొన్నారు.

బీసీల ద్రోహి చంద్రబాబు

నందిగామ: తన పాలనలో బీసీల అభివృద్ధి, సంక్షేమానికి ఏమాత్రం ప్రాధాన్యం ఇవ్వని టీడీపీ అధినేత చంద్రబాబుకు బీసీల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ లీగల్ సెల్ కన్వీనర్ అద్దంకి మణిబాబు శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. బీసీలకు 100 అసెంబ్లీ సీట్లు ఇస్తానని చెప్పిన చంద్రబాబు, ఆచరణలో ఇవ్వకుండా బీసీలను మోసం చేశారని మండిపడ్డారు. చంద్రబాబు పాలనలో ఏ ఒక్క బీసీని కూడా రాజ్యసభకు పంపలేదని గుర్తుచేశారు. బీసీలను రాజ్యసభకు ఎంపిక చేయడంతోపాటు అనేక నామినేటెడ్ పోస్టులను కేటాయించి రాజకీయంగా సముచితస్థానం ఇచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. బీసీలను ఓటుబ్యాంకుగానే చూస్తున్న చంద్రబాబుకు రానున్న ఎన్నికల్లో మరోసారి తగిన బుద్ధిచెప్పేందుకు బీసీలంతా సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

దొడ్డదేవరపాడు(వీరులపాడు): ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తించే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ మహాలక్ష్మణుడు హెచ్చరించారు. మండలంలోని దొడ్డదేవరపాడులో అన్ని రాజకీయ పార్టీల నాయకులు, గ్రామస్తులతో శనివారం రాత్రి ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ కవ్వింపు చర్యలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో నడుచుకోవాలని సూచించారు. ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వైఎస్సార్‌సీపీలో చేరికలు



నందిగామ టౌన్: రాష్ట్రవ్యాప్తంగా ప్రజలంతా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పక్షానే ఉన్నారని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం టీడీపీ, బీజేపీలకు చెందిన 53మంది వైఎస్సార్‌సీపీలో చేశారు. షేక్ సైదా, రాఘవాపురపు వెంకటనారాయణ తదితరులతోపాటు పార్టీలో చేరిన వారికి పార్టీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, వైఎస్ఎన్ ప్రసాద్, అంగడాల పూర్ణచంద్రరావు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ అరుణకుమార్ మాట్లాడుతూ రానున్న కాలంలో ఇతర పార్టీల నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి మరిన్ని చేరికలుంటాయని చెప్పారు. పార్టీలో చేరినవారు నాయకులు, కార్యకర్తలతో కలిసి రానున్న ఎన్నికలలో పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారు.

తిరుమలగిరి ఆలయ మాజీ చైర్మన్ గంటా మృతి



గంటాకు నివాళులర్పిస్తున్న విప్ ఉదయభాను



గంటా హనుమంతరావు (ఫైల్)

జగ్గయ్యపేట: తిరుమలగిరి వాల్మీకోద్భవ వెంకటేశ్వరస్వామి ఆలయ మాజీ చైర్మన్ గంటా హనుమంతరావు (65) శనివారం మృతిచెందాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన విజయవాడలోని ఓవైద్యశాలలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. విజయవాడలోని ఆస్పత్రిలో గంటా హనుమంతరావు మృతదేహాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబసభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. తిరుమలగిరి ఆలయ అభివృద్ధికి ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. గంటా మృతిపట్ల నియోజకవర్గంలోని పలువురు నాయకులు తీవ్రసంతాపం వ్యక్తంచేశారు.

మంచికి అండగా నిలవాలి



నందిగామ పోస్టాఫీస్ రోడ్డులో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: ఈ ఐదేళ్లలో సమర్థవంతమైన పాలన అందించడమే కాకుండా చేయగలిగినంత మంచి చేశామని నందిగామ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. చేసిన మంచిని ప్రజలు గమనించి అండగా నిలవాలని కోరారు. నందిగామ పట్టణంలోని సొసైటీ రోడ్డు, పోస్టాఫీస్ రోడ్డు, కెవీఆర్ కళాశాల ఎదురు రోడ్డు తదితర ప్రాంతాలలో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించి రానున్న ఎన్నికలలో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా ప్రజల ఇళ్లవద్దకు వెళ్లిన ఎమ్మెల్యేకు ప్రజలు ఘనస్వాగతం పలికారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు మాట్లాడుతూ గడిచిన పదేళ్లుగా తమకు అండగా ఉంటూ ఆదరాభిమానాలు చూపుతున్న నందిగామ ప్రజల రుణం తీర్చుకోలేనిదన్నారు. గడిచిన మూడు దశాబ్దాల్లో గత ప్రభుత్వాలు చేయలేని అభివృద్ధిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ఈ ఐదేళ్లలో చేసి చూపించామన్నారు. ముఖ్యంగా పట్టణ ప్రజలకు అవసరమైన తాగునీరు, మురుగుదొడ్లు, అంతర్గత రహదారులతోపాటు మౌలికవసతులు కల్పించినట్లు చెప్పారు. గత ప్రభుత్వాల హయాంలో చీకటిలో మగ్గిన వీధులు సైతం నేడు విద్యుత్ దీపాల వెలుగుల్లో కాంతులీనుతున్న వైనాన్ని గుర్తుచేశారు. తాము చేసిన మంచిని గుర్తించి రానున్న ఎన్నికలలో సైతం మద్దతు పలకాలన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, వార్డు కన్వీనర్ నల్లాని కొండలరావు, నాయకులు గుడివాడ సాంబశివరావు, నాదెండ్ల నరేంద్ర, చిరుమామిళ్ల చైతన్యకుమార్, నెలకుదిటి శివనాగేశ్వరరావు, మన్నెం దాసు, ఈదా వెంకట రెడ్డి, కుంభంపాటి కోటి, షేక్ జాఫర్, పిఎల్ నరసింహారావు, వడ్డెల్లి శ్రీను, బండారు శేషు, వినుకొండ రామారావు, షేక్ ఫాతిమా, పోతురాజు, దొంతిమాల చంద్రశేఖర్, బాపట్ల సాంబయ్య, షేక్ మున్నా, వేణుగోపాలరావు, సాంబ, పబ్బరాజు జగన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూంలకు చేరిన ఈవీఎంలు



పేట జెడ్పీ బాలుర హైస్కూల్‌లోని స్ట్రాంగ్ రూం వద్ద బందోబస్తు విధుల్లో ఉన్న పోలీసు కానిస్టేబుల్

జగ్గయ్యపేట: జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలో వినియోగించనున్న ఈవీఎంలు శుక్రవారం రాత్రి స్ట్రాంగ్ రూంకు చేరాయి. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక స్ట్రాంగ్ రూంలో ఈవీఎంలను భద్రపరిచారు. ఈ స్ట్రాంగ్‌రూం వద్ద 24గంటలు ప్రత్యేక పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేయడంతోపాటు భద్రతను అధికారులు పర్యవేక్షిస్తున్నారు.



ఈవీఎంలు తీసుకువచ్చిన వాహనం డోర్ సీల్ ఓపెన్ చేయిస్తున్న నందిగామ ఆర్ఓ రవీంద్రరావు

కేవీఆర్ కళాశాలకు చేరిన ఈవీఎంలు..

నందిగామ: సార్వత్రిక ఎన్నికలలో వినియోగించేందుకు అవసరమైన ఈవీఎంలు శనివారం రాత్రి నందిగామలోని స్ట్రాంగ్ రూమ్‌కు చేరుకున్నాయి. ఆర్ఓ ఎ.రవీంద్రరావు పర్యవేక్షణలో పోలీసు భద్రత నడుమ ప్రత్యేక వాహనంలో తీసుకువచ్చిన ఈవీఎంలను పట్టణంలోని కెవిఆర్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్ లో భద్రపరిచారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి


ఎమ్మెల్సీ అరుణకుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ అరుణకుమార్

కంచికచర్ల : రానున్న ఎన్నికల్లో నందిగామ ఎమ్మెల్యేగా డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, విజయవాడ ఎంపీగా కేశినేని శ్రీనివాస్(నాని) గెలుపే లక్ష్యంగా అందరూ పనిచేయాలని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ పిలుపునిచ్చారు. కంచికచర్ల ఇందిరాకాలనీ, వసంతకాలనీ, మోగులూరులోని ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో శనివారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ కన్వీనర్లు నన్నపనేని నరసింహారావు, వేమా సురేష్‌బాబు, వైఎస్ ఎంపీపీ బండి మల్లికార్జునరావు, నాయకులు చింతా రవీంద్రనాథ్, ఏఎంసీ వైస్ చైర్మన్ మాడుగుల శంకర్, ఎంపీటీసీ సభ్యులు వేమా రోజారమణి, మాడుగుల మధుబాబు, గుగులోతు ఇందిర, బండారుపల్లి నాగపుష్పలీల, నాయకులు లగడపాటి నాగేశ్వరరావు, అమర్లపూడి యోహాను, వేమా శ్రీనివాసరావు, దేవరకొండ గురవయ్య, ఉప్పు స్వామి, కావాటి రాంబాబు, దాసరి రాజా, షేక్ రజీమ్, మాజీ సర్పంచి షేక్ హుస్సేపాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి 20 కుటుంబాలు



జగ్గయ్యపేట అర్బన్: ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ వైఎస్సార్ సీపీలోకి వలసలు పెరుగుతున్నాయి. జగ్గయ్యపేట మండలంలోని చిల్లకల్లు బీసీకాలనీ పైబజారుకు చెందిన 15కుటుంబాలు శనివారం టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. ఎమ్మెల్యే ఉదయభాను నివాసంలో వీరికి పార్టీ యువనాయకుడు సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో పల్లపు అర్జునరావు, పల్లపు రామయ్య, పల్లపు శ్రీహరి, పల్లపు నాగరాజు, తాళ్లూరి శ్రీను, రూపాన నాగయ్య, మల్లెల అలివేలు, కుంచపు దుర్గ, హార్జన్ లక్ష్మితోపాటు మరో ఐదు కుటుంబాలవారు ఉన్నారు. ఈసందర్భంగా వెంకటకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే ఉదయభాను చేస్తున్న కృషిని చూసి రోజురోజుకు వైఎస్సార్‌సీపీలోకి చేరికలు పెరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు సుంకర వేణు, నాయకులు ముత్తినేని శిరీష, జీవరత్నం, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యానగర్ నుంచి..

పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన నీలకంఠం కుమారి, పేరవరపు రాము, సుమంత్ తదితర ఐదు కుటుంబాల వారు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. నాయకులు మారిశెట్టి కోటేశ్వరరావు, మల్లెంపూడి శివ పాల్గొన్నారు.

పోలింగ్ నిర్వహణపై అధికారులకు శిక్షణ



మాట్లాడుతున్న ఆర్ఓ వెంకటేశ్వర్లు

జగ్గయ్యపేట: అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ కేంద్రాల అధికారులు, అసిస్టెంట్ పోలింగ్ కేంద్రాల అధికారులు బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి ఆర్.వెంకటేశ్వర్లు ఆదేశించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాల అధికారులు, అసిస్టెంట్ పోలింగ్ కేంద్రాల అధికారులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్ఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల అధికారులు, అసిస్టెంట్ పోలింగ్ కేంద్రాల అధికారులు ఎన్నికల నిబంధనలను పాటించాలన్నారు. ముఖ్యంగా ఈవీఎం మిషన్లు, ఓటరును గుర్తించడం, ఓటు వేసిన ఓటరుకు సిరా ఇంకు రాయడం తదితర అంశాల్లో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఏ చిన్న పొరబాటు చోటుచేసుకున్నా తీవ్ర చర్యలుంటాయని హెచ్చరించారు. పోలింగ్ ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అనంతరం నమూనా ఈవీఎంలపై అవగాహన కల్పించారు. నియోజకవర్గ వ్యాప్తంగా 600 పోలింగ్ అధికారులకుగాను, జగ్గయ్యపేట మండలంలోని 371 మందికి శిక్షణనిచ్చినట్లు తెలిపారు. వత్సవాయి, పెనుగంచిప్రోలు, నందిగామ ఏటిపట్టు గ్రామాల సిబ్బందికి ఆదివారం శిక్షణ ఇస్తామని వివరించారు. మున్సిపల్ కమిషనర్ మల్లేశ్వరరావు, డిప్యూటీ తహసీల్దార్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు బంజారాల సదస్సు



జగ్గయ్యపేట అర్బన్: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని ఎస్టీల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుచేయడంతోపాటు వారి అభ్యున్నతికి కృషి చేశారని జగ్గయ్యపేట నియోజకవర్గ బంజారా(లంబాడి) నాయకులు తెలిపారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బంజారా నాయకులు శనివారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక బి కన్వెన్షన్‌లో ఆదివారం ఉదయం 10 గంటలకు జగ్గయ్యపేట నియోజకవర్గ బంజారాల(లంబాడీ) సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బంజారా(లంబాడీ)లకు ఇంతటి ప్రాధాన్యతనిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభానుకు కృతజ్ఞతలు తెలిపేందుకు బంజారాల సదస్సును ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ సదస్సుకు బంజారాలంతా తప్పక హాజరుకావాలని బంజారా నాయకుడు, వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి లాహోరి బద్ధూనాయక్, పేట మండల సమాఖ్య అధ్యక్షురాలు శ్యామల, మాజీ జెడ్పీటీసీ సభ్యులు శ్రీరాములునాయక్, బాల్యానాయక్ పాల్గొన్నారు.

చిరుజల్లులతో సేదతీరిన జనం

నందిగామ: నందిగామ ప్రాంతంలో శనివారం మధ్యాహ్నం మండుటెండలో చిరుజల్లులు కురిశాయి. సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఓ వైపు ఎండ కాస్తుండగా, మరోపక్క వర్షపు జల్లులు పడ్డాయి. దీంతో వాతావరణం చల్లగా మారింది. వర్షపు జల్లులు పడటంతో ప్రజలు కాస్త సేద తీరారు.